వరి పంటకు మెడవిరుపు

- పంట చేతికందే సమయంలో కొత్త సమస్య
- వరుస నష్టాలతో కుదేలు
- పెట్టుబడిపై ఆశ వదులుకున్న అన్నదాత
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు


తాలు, మెడవిరుగుడుతో దెబ్బతిన్న వరి పంట చేతికందే సమయంలో..

వేములవాడఅర్బన్: ఆరుగాలం ఎన్నో కష్టనష్టాల కోర్చి పండిస్తున్న వరి పంటకు చివరి దశలో మెడ విరుపు నోటికాడి ముద్దను గుంజుకున్నట్లు చేస్తోం దని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో వేములవాడ మండలంలో 5,250 ఎకరాలు, వేములవాడ రూరల్ మండలంలో 10,500 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. రైతులు కష్టాన్ని నమ్ముకుని వరి నాట్లు వేసినప్పటి నుంచి మొదలు ధాన్యం చేతికి అందే వరకు పెట్టు బడి పెడుతునే ఉన్నారు. వరి నాటు వేసినప్పటి నుంచి మొదలు చీడపీడల నివారణకు నాలుగైదుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాల్సివచ్చింది. దీంతో కోలుకున్న వరి పైర్ల ఎదుగుదలకు రైతులు ఎరువులు వేయడంతో సమస్య తీరిందని అనుకుంటున్న తరుణంలో తాలు సమస్య వచ్చిపడింది. అక్కడికి ఆగకుండా వరి గొలక అవుతున్న సమయంలో మెడవిరుపు తెగులు ఆశలను ఆవిరి చేసింది. ఈ తెగులుతో పంట ఎరుపుగా మారి గింజ ఎదుగుదల లేకుండా ఎర్రబడి పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి గొలక అయ్యే దశలో ఎలాంటి క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా లాభం లేకుండా పోయిందని అంటున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు

దుక్కి నుంచి మొదలు వరికి ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వెచ్చించాల్సి ఉంటుంది. కాని ఈ సంవత్సరం రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు ఖర్చు అవుతోందని, అయినా లాభం లేదని రైతులు అంటున్నారు. ఈ తెగుళ్ల మూలంగా ధాన్యం దిగుబడి తగ్గి కనీసం పెట్టిన పెట్టుబడిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు దిగులు చెందుతున్నారు. తాలు, మెడవిరుపు తెగులుతో నష్టపోయిన పంటలను ప్రభుత్వం సర్వే చేసి రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడి ఖర్చు అయినా అందించాలని కోరుతున్నారు.

తాలు సమస్య



ఈ సంవత్సరం నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరి పంట వేశా. ఎన్నడు లేని విధంగా పంటకు విపరీతంగా తాలు, మెడ విరుగుడు సమస్యతో పంట పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం ఆదుకోవాలి.
– దేవయ్య రైతు. గొల్లపల్లె

సర్వే చేయాలి



యాసంగి వరి పంట పూర్తిగా దెబ్బతింది. వాతావరణం మార్పుల వల్ల పంటలో తాలు, మెడవిరుపు నష్టం కలిగించాయి. పంట సర్వే చేసి, పెట్టిన పెట్టుబడి ఖర్చును అందించి ఆదుకోవాలి.
– రాజమల్లయ్య, రైతు నాంపల్లి

నివారణ చర్యలు ముందే చేపట్టాలి



చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మీ.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 80 మి.లీ ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.
– భాస్కర్, ఏడీఏ, వేములవాడ

క్లుప్తంగా

మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించాలి


సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్థిరత్వం సాధించాలని ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ ముక్క శంకర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం మంత్రి కేటీఆర్ దత్తత గ్రామమైన రాజన్నపేటలో ఆదివారం మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీలో సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. వడ్డీ లేని రుణాలను వినియోగించుకొని ఫ్యాషన్ డిజైనింగ్, కుట్లు అల్లికలతో తయారు చేసిన వస్తువులను విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, కార్యదర్శి రవి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంఘ భవనానికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లిలో రెడ్డి సంఘం భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు రెడ్డి సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి


ప్రొసీడింగ్ కాపీలను అందిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ మాఫీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం మల్లేశం అన్నారు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లోని 45 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన వడ్డీమాఫీ రూ.9.88 లక్షల ప్రొసీడింగ్ కాపీలను మహిళా సంఘాల సభ్యులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించిన వారికే వడ్డీ మాఫీ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సంఘాల సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడిగెల రవీందర్, ఎంపీటీసీ వరద బాబు, వీవోఏలు, వీవో అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ వేడుకల్లో పాల్గొని, స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

ముస్తాబాద్ బంద్ ప్రశాంతం

- బీజేపీ నేతల అరెస్టుకు నిరసనగా ధర్నా


ముస్తాబాద్‌లో మూసివున్న దుకాణాలు

ముస్తాబాద్: బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, కల్యాణ్‌ల అరెస్టుకు నిరసనగా బీజేపీ నాయకులు పిలుపునిచ్చిన బంద్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో హోటళ్లు, కిరాణ దుకాణాలు, వస్త్ర వ్యాపార సముదాయాలు మూసి ఉంచారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. బీజేపీ నాయకులు స్వామి వివేకానంద విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడితే పోలీసులు వారిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. తమ నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ, శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ యెల్ల గిరిధర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రయాణికుల ఇబ్బందిని పట్టించుకోరా?

చందుర్తి: మండలంలోని ఎన్గల్-హన్మాజీపేట గ్రామాల మధ్య రైస్‌మిల్లులకు 11 కేవీ విద్యుత్ లైన్ వేసేందుకు అడ్డుగా ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలు నరికి అలాగే వదిలేశారు. దీంతో రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాలను సైడ్ ఇవ్వబోయి ద్విచక్ర వాహనాదారులు కొమ్మలు తాకి కింద పడుతున్నారని వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు చెట్లను, కొమ్మలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : సతీశ్, ఆర్ అండ్ బీ ఏ.ఈ, చందుర్తి.
ఫోన్ నెంబర్: 9440818862

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి


తంగళ్లపల్లి: జిల్లెల్లలో..


సిరిసిల్లఅర్బన్: నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు


ముస్తాబాద్: ఆవునూర్‌లో..


బోయినపల్లిలో..

బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను జిల్లాలోని ఆదివారం అన్ని మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా గోపా కన్వీనర్ కంచర్ల అమరేందర్ గౌడ్, సలహా సంఘం సభ్యులు, గౌడ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
– సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి/బోయినపల్లి/ముస్తాబాద్

సీపీఐ, సీపీఎం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 9న నిర్వహించే సీపీఐ, సీపీఎంల బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం పార్టీలు కలిసి ఎన్నికల బరిలో నిలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు అజ్జ వేణు, శేఖర్ పాల్గొన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు


డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న డీఎస్పీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి చలానాలు విధించారు. డీఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. వాహన తనిఖీల్లో సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్, తంగళ్లపల్లి ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో క్రీడా మైదానం లేక యువ క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక యువకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.20 లక్షల వ్యయంతో పోలీస్‌స్టేషన్ సమీపంలో అభివృద్ధి చేస్తే పోలీస్ శాఖకు చెందిన స్థలం అని పోలీస్ సిబ్బంది నెట్టు తొలగించారని స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పందించి మండల కేంద్రంలో ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉంటే అక్కడ క్రీడా మైదానం ఏర్పాటు చేయించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలపై దాడి దురదృష్టకరం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు పాఠశాలపై ఏబీవీపీ విద్యార్థి నాయకులు దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడాన్ని ఆదివారం ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఒక ప్రకటనలో ఖండించింది. పాఠశాలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా సిరిసిల్ల మండల అధ్యక్షుడు శభరి శ్రీనివాస్, తంగళ్లపల్లి అధ్యక్షుడు రాజనర్సు తో పాటు పలువురు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లె గ్రామంలో ఏర్పాటు చేయబోయే అంబేద్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ పూరాన్ని మంజుల లింగారెడ్డి దంపతులు రూ.10 వేలు విరాళం అందజేశారు.

స్వేరోస్ ఆధ్వర్యంలో భీమ్ దీక్ష

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఆదివారం స్వేరోస్ నెట్‌వర్క్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భీమ్ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఫిట్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్కె సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు పంతం ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వైరస్ సోకి ఎండుతున్న వేప చెట్లు

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వేప చెట్లు ఎండి పోతున్నాయి. వేప చెట్టు వ్యవసాయంలో చీడపీడల నియంత్రణతోపాటు ఆయుర్వేదంలో కీలకపాత్ర పోషించే ఔషధ వృక్షం వేప చెట్లు ఎండిపోతుండడంతో ఏదైనా వైరస్ సోకిందేమోనని ఆందోళన చెందుతున్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామంలో ఐఎంఏ, లైఫ్‌లైన్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెన్నాడి జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు రాంకిరణ్, వైద్యులు ప్రదీప్‌కుమార్, కంచన్, నయని, వేణుగోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: వేములవాడలో దాతల సహకారంతో 80 మంది పేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధులు మహేశ్, రాజేందర్, సత్తయ్య, ప్రతాప నటరాజ్, చంద్రశేఖర్, జంగిటి రమేశ్, అశ్విని, వెంకటేశ్వర్‌రావు, స్నేహలత, సంపత్, స్వప్న, రవీందర్, జ్యోతి పాల్గొన్నారు.

సమాచారం

రేపు మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల మండల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

నియామకం

బీరప్ప యూత్ అసోసియేషన్ కార్యవర్గం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ బీరప్ప యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొప్పెన ప్రశాంత్, ప్రధానకార్యదర్శిగా ఎగుర్ల మహేశ్, ఉపాధ్యక్షుడిగా మ్యాకల ప్రశాంత్ ఎన్నికయ్యారు.

చలో ఢిల్లీకి తరలిన నాయకులు


తరలి వెళ్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఏప్రిల్ 5న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా సీఐటీయూ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ సంఘం, కార్మిక సంఘం నాయకులు దాదాపు 45 మంది తరలివెళ్లారు. సీఐటీయూ నాయకులు కోడం రమణ, మూశం రమేశ్, తదితరులు వారిలో ఉన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

వీర్నపల్లి: ఈ నెల 3న బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ వచ్చిన బీజేపీ ప్రభుత్వం నమ్మించి దారుణంగా మోసం చేసిందన్నారు. అందుకే బీజేపీ పార్టీనే మాదిగలకు ప్రథమ శత్రువు అన్నారు. బీజేపీ మీద యుద్ధానికి సిద్ధం కావాలని మాదిగ యువతకు పిలుపునిచ్చారు. రాజకీయంగా బీజేపీని బొంద పెట్టేందుకు అందరూ కదిలిరావాలని కోరారు. ఒకవైపు దేశంలో ప్రైవేటీకరణ పెరుగుతుందని, ఇంకోవైపు ప్రతి విద్యా సంవత్సరం ఉన్నత విద్యావకాశాలు కోల్పోతున్నామని అన్నారు. జిల్లాలో జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, మాదిగ యువత నాయకులు పాల్గొన్నారు.

వేములవాడలో ఆరు పరీక్షా కేంద్రాలు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి విద్యార్థులకు ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు, జెడ్పీ ఉన్నత పాఠశాల(బాలికల), తిప్పాపూర్ జెడ్పీ పాఠశాల, గాంధీనగర్ ఉజ్వల పాఠశాల లో కలిపి మొత్తం 1,153 విద్యార్థులు హాజరుకానున్నారు.

కోనరావుపేట: మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో దూస రఘుపతి తెలిపారు. కోనరావుపేట ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ధర్మారం ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాల్లో కలిపి మొత్తం 415 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి పరీక్ష కేంద్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రవి తెలిపారు. పరీక్ష కేంద్రంలో వీర్నపల్లి జెడ్పీహెచ్ఎస్, కేజీబీవి, మోడల్ స్కూల్, గర్జనపల్లి జెడ్పీహెచ్ఎస్, అల్మాస్‌పూర్ జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీల నుంచి 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి మోక్షం

- రూ.1.56 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణం
- మెరుగుపడనున్న వైద్యం
- నిర్మాణం అనంతరం అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం


శిథిలావస్థలో పీహెచ్‌సీ భవనం

ఇల్లంతకుంట: ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన భవనంలో అరకొర వసతుల మధ్య సేవలందిస్తున్న స్థానిక పీహెచ్‌సీకి ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలో 33 గ్రామపంచాయతీలు, 15 అనుబంధ గ్రామాలు ఉండగా ఒకే ఒక పీహెచ్‌సీ ఉంది. శిథిలావస్థకు చేరిన ఈ భవనం భారీ వర్షాలు కురిస్తే పైకప్పు పెచ్చులూడి పోయి, ఉరుస్తుండడంతో అటు వైద్య సిబ్బంది, ఇటు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు విన్నవించగా, ఆయన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన వారు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

ఆస్పత్రి ఆవరణలోని ఖాళీ స్థలంలో రూ.1.56 కోట్లతో అన్ని సదుపాయాలతో నిర్మించే నూతన భవనానికి ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కొత్త భవన నిర్మాణంతో ఇబ్బందులన్నీ తొలగిపోతాయని స్థానిక ప్రజలతో పాటు పీహెచ్‌సీ సిబ్బంది భావిస్తున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తి అయిన వెంటనే ప్రస్తుతం ఆరు పడకల పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే అవకాశాలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు అంటున్నారు.

నాణ్యమైన వైద్యం అందుతుంది



ఎమ్మెల్యే రసమయి సహకారంతో మంజూరైన పీహెచ్‌సీ నూతన భవనం పూర్తయితే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది.
– భాగ్యలక్ష్మి, సర్పంచ్, ఇల్లంతకుంట

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com